సాక్షి సంగారెడ్డి

గురువారం । 19 । సెప్టెంబర్ । 2024



ఆర్టీసీలో 'క్యూ ఆర్' కోడ్

'క్యూఆర్ కోడ్'ను ఆర్టీసీ అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో పది రకాల సేవలు ఒకే చోట లభించనున్నాయి.


వివరాలు 8లో ▸



ఏటీఓలో చెక్కులు మాయం

కోహిడ మండలం మూడు చెక్కులను ఏటీఓ కార్యాలయానికి పంపించారు. అవి కార్యాలయంలో కనిపించడం లేదు.

వివరాలు 8లో ▸



వానొస్తే.. అగచాట్లు

వాగు ఉప్పొంగితే బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయి. వంగ్దల్ గైర్హాన్ తండా గిరిజనుల పరిస్థితి ఇదీ.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

సస్యరక్షణపై అవగాహన అవసరం

జిల్లా సస్యరక్షణ కేంద్రం అధికారి సునీత



పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు

హత్నూర(సంగారెడ్డి): పత్తి పంట సస్యరక్షణపై రైతులకు అవగాహన అవసరమని జిల్లా సస్యరక్షణ కేంద్రం అధికారి సునీత అన్నారు. బుధవారం హత్నూర మండలం కాసాల రైతు వేదికలో రైతులు పత్తి పంట సాగులో తీసుకోవలసిన సస్యరక్షణ చర్యలపై రెండు రోజులపాటు నిర్వహించే అవగాహన సదస్సును ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రైతులు పత్తి పంటపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పురుగుల మందుల వాడకం తగ్గించి సేంద్రియ జీవఎరువులను వాడాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖ రూపొందించిన జాతీయ చీడపీడల నివారణ నిఘా వ్యవస్థపై అవగాహన పెంచుకోవాలన్నారు. పంటలపై పురుగులు వ్యాపిస్తున్న దశలోనే వాటి నివారణకు వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. చీడపీడల నివారణ కోసం వ్యవసాయ అధికారులు సూచించిన మందులను పిచికారీ చేయాలని తెలిపారు. తొలుత బోరుపట్ల పత్తి పంటలను రైతులతో కలిసి సునీత పరిశీలించారు. కార్యక్రమంలో డీఏఓ శివకుమార్, టీటీసీ కోఆర్డినేటర్ రాహుల్ విశ్వకర్మ, ఏఓ శ్రీనివాస్, ఏఈఓ లు రైతులు పాల్గొన్నారు.

నూతన ఏడీఏగా వెంకటలక్ష్మి



ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను కలిసిన ఏడీఏ వెంకట లక్ష్మి

సంగారెడ్డి : సంగారెడ్డి అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఆఫీసర్‌గా (ఏడీఏ) వెంకట్ లక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాసనసభ్యుడు చింతా ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కాసాల బుచ్చిరెడ్డి వివిధ మండలాల అగ్రికల్చర్ ఆఫీసర్లు ఉన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

సంగారెడ్డి ఎడ్యుకేషన్: స్థానిక తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీబీఏ విద్యార్థులకు బోధించేందుకు అతిథి అధ్యాపక పోస్టుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్న ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో బీబీఏ విద్యార్థులకు బోధించేందుకు ఎంబీఏ పూర్తి చేసి 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు ఈనెల 20న సాయంత్రం 5 గంటల లోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంబీఏలో నెట్, స్లేట్, పీహెచ్‌డీ కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యమస్తామని తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 21న ఉదయం 10.30 గంటలకు కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఒక జిరాక్స్ సెట్, రెండు ఫొటోలతో హాజరు కావాలన్నారు.

నేడు జాబ్‌మేళా

సంగారెడ్డి క్రైమ్: డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో ఈనెల 19న ఉదయం 11 గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా అధికారి అనిల్‌కుమార్ తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణత సాధించి ఉండాలని, వయసు 19 నుంచి 27 ఏళ్ల మధ్య ఉన్న వారు హాజరుకావాలని పాత డీఆర్‌డీఓ ఆఫీస్‌లోని జిల్లా ఉపాధి ఆఫీస్‌లో సంప్రదించాలని సూచించారు. వివరాలకు 08455-271010 నంబర్‌లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

మెనూ కోసం నిరసన

నారాయణఖేడ్: స్థానిక మహాత్మా జ్యోతిరావు పూలే గురుకులంలో సరైన మెనూ పాటించడం లేదని ఏఐఎఫ్‌డీఎస్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి టి.కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకుడు సీహెచ్ అశోక్‌లు ఆరోపించారు. బుధవారం గురుకులంను పరిశీలించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెనూ ప్రకారం బుధవారం చికెన్ వండాల్సి ఉండగా వండలేదని తెలిపారు. దానిపై ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌ను ఫోన్‌లో మాట్లాడితే కుంటి సాకులు చెబుతూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇష్టానుసారం కొనసాగిస్తున్న గురుకులంను ఆర్సీఓ వెంటనే తనిఖీ చేసి పిల్లలకు న్యాయం చేయాలన్నారు. లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి ఏఐఎఫ్‌డీఎస్, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు.



రాయికోడ్ సీసీఐ కేంద్రంలోని పత్తి (ఫైల్)

పత్తి కొనుగోళ్లకు సమాయత్తం

- జిన్నింగ్ కోసం మిల్లుల నుంచి టెండర్లు
- 12.50 లక్షల క్వింటాళ్లు కొనే అవకాశం

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : రానున్న కొనుగోలు సీజన్‌కు సంబంధించి పత్తి కొనుగోళ్లకు సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) సన్నాహాలు చేస్తోంది. కొనుగోలు చేసిన పత్తిని జిన్నింగ్ చేసేందుకు అవసరమైన మిల్లులను లీజుకు తీసుకునేందుకు టెండర్ నోటిఫికేషన్ విడుదల చేసింది. సీజన్‌లో కొనుగోలు చేసిన పత్తిని లీజుకు తీసుకున్న మిల్లుల్లో జిన్నింగ్, ప్రెస్సింగ్ చేసి బేళ్లు తయారు చేస్తుంది. మొత్తం 22 జిన్నింగ్ మిల్లులను లీజుకు తీసుకోవాలని సీసీఐ నిర్ణయించింది. ఈ టెండరు ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోంది.

సంగారెడ్డి జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో మొత్తం పంటల సాగు విస్తీర్ణం 7.30 లక్షల ఎకరాలు కాగా, ఇందులో 3.56 లక్షల ఎకరాల్లో పత్తి సాగైనట్లు వ్యవసాయశాఖ అంచనా వేసింది. మెదక్ జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో మొత్తం పంటల సాగు విస్తీర్ణం 3.50 లక్షల ఎకరాలైతే.. ఇందులో 45,100 ఎకరాల్లో పత్తి సాగైనట్లు ఆశాఖ తేల్చింది.

కొనుగోలు కేంద్రాలు..

ఏటా నవంబర్‌లో రైతులు పత్తి తీయడం ప్రారంభిస్తారు. దీంతో నెల రోజులే గడువుండటంతో కొనుగోళ్లకు సీసీఐ సన్నాహాలు చేస్తోంది. ఈసారి సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో కలిపి 22 చోట్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు సీసీఐ ప్రణాళిక సిద్ధం చేస్తోంది. సంగారెడ్డి జిల్లాలో రాయికోడ్, సదాశివపేట, జోగిపేట, నారాయణఖేడ్, వట్‌పల్లిల్లోని జిన్నింగ్ మిల్లుల్లో పత్తి సేకరణ జరుగుతోంది. మెదక్ జిల్లాకు సంబంధించి పాపన్నపేట్‌లోని పత్తి కొనుగోళ్లు చేపట్టనున్నారు.

కనీస మద్దతు ధర

పత్తి కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.7,521లు ఉంది. అయితే ప్రస్తుతం మార్కెట్ ధర క్వింటాలుకు రూ.8,500ల వరకు పలుకుతోంది. గత ఏడాది పండించిన నిల్వ ఉంచిన పత్తికి ఈ ధర వస్తోంది.

అధిక వర్షాలతో దిగుబడిపై ప్రభావం

జిల్లాలో ఇటీవల కురిసిన అధిక వర్షాలతో పత్తి పంట దెబ్బతింది. విత్తుకున్న తొలి రోజుల్లో వర్షాలు లేక పంట వాడిపోగా, ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పత్తికి బాగా డ్యామేజీ అయింది. దీని ప్రభావం దిగుబడిపై పడుతుందని పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు. సుమారు 15 శాతం నుంచి 20 శాతం వరకు పత్తి దిగుబడి పడిపోతుందని అనధికారికంగా అంచనా వేస్తున్నారు.

అయితే మార్కెట్‌లోకి పత్తి రావడం ప్రారంభమైతే వ్యాపారులు ధరను తగ్గించి పత్తి రైతులను దోపిడీకి గురిచేసే అవకాశాలున్నాయి. సీసీఐ కొనుగోళ్లు లేకపోతే వ్యాపారులు రైతులను నిండా ముంచుతారు. సిండికేట్‌గా మారి ధరలో భారీగా కోత విధించడం పరిపాటిగా తయారైంది. సీసీఐ మార్కెట్‌లో ఉంటే వ్యాపారుల ఆగడాలకు కొంత మేరకు చెక్ పడనుంది.

సుమారు 2.50 లక్షల బేళ్లు..

సంగారెడ్డి, మెదక్ జిల్లాలో కలిపి గత ఏడాది కొనుగోలు సీజన్‌లో సుమారు 2.50 లక్షల బేళ్ల పత్తి కొనుగోలు చేసినట్లు సీసీఐ అధికార వర్గాలు చెబుతున్నాయి. సుమారు 12.50 లక్షల క్వింటాళ్ల పత్తి సేకరించినట్లు చెబుతున్నారు. ఈసారి సీజన్‌లో కాస్త అటూ ఇటూగా అదే స్థాయిలో కొనుగోళ్లు ఉంటాయనే అంచనాకు వస్తున్నారు. ఇందులో భాగంగానే జిన్నింగ్ మిల్లులను లీజుకు తీసుకునేందుకు టెండరు ప్రక్రియను చేపట్టారు.

నిమజ్జనం ప్రశాంతం



నిమజ్జనం కోసం తరలివచ్చిన గణనాథులు

ఎస్పీ రూపేశ్ పర్యవేక్షణ

జహీరాబాద్: జహీరాబాద్‌లో వినాయక విగ్రహాల నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. బుధవారం మధ్యాహ్నం వరకు కొత్తూర్‌లోని నారింజ ప్రాజెక్టులో వినాయక నిమజ్జనాలు ప్రశాంతంగా కొనసాగాయి. మంగళవారం అర్ధరాత్రి దాటాక ఆయా మండపాల నుంచి నిర్వాహకులు వినాయక విగ్రహాలకు పూజలు చేసి నిమజ్జనాలకు ఊరేగింపుగా బయలుదేరారు. ప్రతిష్టించిన చోటే యువకులు, మహిళలు నిమజ్జన ఊరేగింపులో పాల్గొని కోలాటం, నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. నిమజ్జన ఉత్సవాలతో పట్టణం భక్తులతో సందడిగా మారింది. మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వినాయక విగ్రహాల ఊరేగింపులను తిలకించారు. ఉత్తమ అలంకరణలకు సార్వజనిక్ ఉత్సవ కమిటీ తరఫున బహుమతులను ఎమ్మెల్యే మాణిక్‌రావు చేతుల మీదుగా అందజేశారు. వినాయక విగ్రహాల వద్ద లడ్డూ వేలం పాటల్లో భక్తులు పాల్గొని కొనుగోలు చేశారు. ఎస్పీ రూపేశ్, డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ శివలింగం, ఎస్.ఐ కాశీనాథ్‌లు పట్టణంలో పర్యటించి నిమజ్జ ఊరేగింపులను పర్యవేక్షించారు. ఉత్సవాల్లో ఎంపీ సురేశ్ శెట్కార్, ఎమ్మెల్యే మాణిక్‌రావు, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్, మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్, ఐడీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎండీ తన్వీర్, డీసీసీబీ మాజీ చైర్మన్ ఎం.జైపాల్‌రెడ్డి, సార్వజనిక్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మనోహర్ కర్దాస్, సభ్యులు, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటరు తుదిజాబితా



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్

అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డిజోన్: త్వరలో జరిగే గ్రామపంచాయతీ ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఆయన సమావేశయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటరు జాబితా రూపకల్పనలో ఒక కుటుంబానికి సంబంధించి అన్ని ఓట్లు ఒకే వార్డులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా గ్రామ పంచాయతీల్లో వీఐపీ, వీవీఐపీల ఓట్లు మిస్ కాకుండా చూసుకోవాలన్నారు. ఇటీవల ప్రచురించిన ఓటు జాబితాలో ఈనెల 21 వరకు తమ అభ్యంతరాలను తెలపాచ్చన్నారు. తప్పులు లేని ఓటరు జాబితా రూపకల్పనకు అన్ని పార్టీల నాయకులు అధికారులకు సహకరించాలన్నారు. జిల్లాలోని అన్ని మండల స్థాయిలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో జిలా పంచాయతీ అధికారి సాయిబాబా, ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పనివేళలు శాస్త్రీయంగా నిర్వహించండి



నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి
- నల్లబ్యాడ్జీలతో నిరసన

పటాన్‌చెరు టౌన్: గురుకుల పాఠశాలల పని వేళలను శాస్త్రీయంగా నిర్వహించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీఎస్ యూటీఎఫ్, గురుకుల జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని గురుకులంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గురుకుల పాఠశాలల పనివేళలు విద్యార్థుల మానసిక వికాసానికి తగిన విధంగా ఉండాలని, ఉపాధ్యాయులు ఒత్తిడి లేకుండా పని చేసేలా ఉండాలన్నారు. విద్యార్థులపై మానసిక ఒత్తిడి, పౌష్టికాహారలోపం, శారీరక వ్యాయామం లోపం వివిధ మానసిక రుగ్మతలకు దారితీసి ఆత్మహత్యలకు కారణమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల ప్రభుత్వం అన్ని గురుకుల సొసైటీలకు ఒకే పనివేళలను నిర్ణయిస్తూ జీఓ 16 జూలై 2న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పేరుతో ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. ఈ టైంటేబుల్ శాస్త్రీయంగా లేదని, విద్యార్థులపై ఒత్తిడి పెంచేదిగా ఉందన్నారు. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శోభ రాణి, మండల ప్రధాన కార్యదర్శి రంగయ్య నాయుడు, కార్యదర్శి హలీం, గురుకుల ఉపాధ్యాయులు జయ, స్వప్న,ఉమ,లక్ష్మి, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీకే అమ్మాలి

వట్‌పల్లి(అందోల్): రైతులకు రసాయన ఎరువులు, పురుగు మందులు అధిక ధరలకు విక్రయించినా, కాలం చెల్లిన మందులు అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని వట్‌పల్లి, మర్వెళ్లి గ్రామాల్లో ఉన్న పలు ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. ఎరువుల విక్రయాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. రైతులకు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలన్నారు. స్టాక్ నిల్వలు, ధరల పట్టికను రైతులకు తెలిసేలా అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం గౌరైకల్, మర్వెళ్లి గ్రామాల్లో సాగవుతున్న పత్తిని పరిశీలించారు.

హామీల అమలుకు సీఎం కృషి

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



పూజలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

కొల్చారం(నర్సాపూర్)/చిలప్‌చెడ్: అప్పుల్లో ఉన్న రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తూ, ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆ భగవంతుడు శక్తినివ్వాలని రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. మండలంలోని రంగంపేట ఆశ్రమాన్ని స్పీకర్ బుధవారం సందర్శించారు. ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతీ చాతుర్మాస దీక్ష విరమణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆశ్రమ పురోహితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాశివరాత్రి మరుసటి రోజు రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని మాధవానంద స్వామి కోరారని.. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసేందుకు సీఎం ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ మర్యాదపూర్వకంగా కలిసి జ్ఞాపికను బహుకరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, నర్సాపూర్ ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ గఫూర్‌మియా, ఆర్ఐ ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి ప్రియాంక తదితరులు పాల్గొన్నారు. అలాగే చిట్కుల్ శివారులో గల చాముండేశ్వరీ అమ్మవారిని స్పీకర్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచండి

సంగారెడ్డి అర్బన్: పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలను తక్షణమే పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎర్రోళ్ల మహేశ్ అన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) పట్టణంలోని జిల్లా కార్యాలయంలో ముఖ్యనాయకులతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేయట్లేదన్నారు. హాస్టల్‌లో వసతులు లేక అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను రూ.3 వేలకు పెంచాలని, పెండింగ్ లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు వెంటనే విడుదల చేయాలన్నారు. ఆ మేరకు ఇందిరాపార్కు వద్ద ఈనెల 27న జరిగే విద్యార్థి మహాగర్జనను జయప్రదం చేయాలని కోరారు. ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీను, విష్ణువర్ధన్, కార్తీక్, రాజు పాల్గొన్నారు.

నిలిచిన ఆరోగ్యశ్రీ సేవలు

సమ్మెలోకి ఆరోగ్యమిత్రలు

- ఉమ్మడి జిల్లాలోని 41 ఆస్పత్రుల్లో సేవలు బంద్!
- కనీస వేతనం, ఇతర బెనిఫిట్స్ కోసం డిమాండ్



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఆరోగ్యమిత్రలు

ఆరోగ్య మిత్రలు సమ్మెబాట పట్టారు. 16 ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి. దీంతో వేతనాలు పెంచాలని, క్యాడర్ మార్చాలని డిమాండ్లతో బుధవారం నుంచి నిరవధిక సమ్మెలోకి దిగారు. దీంతో ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోయాయి.

జోగిపేట (అందోల్): ఉమ్మడి మెదక్ జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రులు 17, ప్రైవేట్ ఆస్పత్రులు 24 మొత్తం 41 ఆస్పత్రుల్లో సేవలు బంద్ అయ్యాయి. ఆరోగ్య మిత్రల సంఘం రాష్ట్ర నేతలు ఈ ఆగస్టు 6న సమ్మె నోటీసు ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి.దామోదర్ రాజనర్సింహ, ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ సీఈఓలను కలిసి తమ సమస్యలను పట్టించుకోవాలని విజ్ఞప్తులు చేశారు. ఎన్నోసార్లు నిరసనలు, ఆందోళనలు చేపట్టినా ప్రయోజనం లేకపోయిందని వాపోయారు.

ప్రముఖ పాత్ర

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా 2007లో ఆరోగ్యశ్రీ పథకాన్ని తెచ్చారు. ఈ పథకం కింద ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఉచితంగా ఆపరేషన్లు చేస్తున్నారు. దీంతో నిరుపేదలకు ఈ పథకం వరంగా మారింది. కొన్ని వేల మంది ఈ పథకంతో లబ్ధిపొందడంతో పాటు ఎంతో మంది ప్రాణాలు నిలిచాయి. అంతటి ప్రాచుర్యం పొందటంలో ఆరోగ్యమిత్రల పాత్ర కీలకంగా ఉంది. ఆస్పత్రికి కేసు వచ్చిన తర్వాత ఆరోగ్యశ్రీ ట్రస్టులో రిజిస్టర్ చేయడంతో పాటు ఆపరేషన్ చేయించి, ఆటో చార్జీలు సైతం ఇచ్చి ఇంటికి పంపించే వరకు సేవలు అందిస్తారు.

చాలీచాలని వేతనాలతో దుర్భర జీవితాలు

ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా 41 ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేస్తున్నాయి. అందులో 43 మంది ఆరోగ్య మిత్రలు పని చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 900 మంది ఆరోగ్య మిత్రలను నియమించింది. ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న వీరికి నెలకు రూ. 15,500 వేల వేతనాన్ని ఇస్తున్నారు. అయితే పీఎఫ్, ఈఎస్ఐ కట్ అయ్యి, రూ.13,500 మాత్రమే వేతనం వస్తోంది. ఆ వేతనం పెరిగిన ధరలకనుగుణంగా లేదని, రూ. 22,750లకు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. కంప్యూటర్ పరిజ్ఞానం, నైపుణ్యంతో కూడుకున్న విధులు నిర్వర్తిస్తున్నందున క్యాడర్ పేరును డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్‌గా మార్చాలని కోరుతున్నారు. గతంలో వేతనాలు పెంచుతామని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ యాజమాన్యం హామీ ఇచ్చినా ఆచరణలోకి వచ్చేసరికి అమలు కాలేదు.

డిమాండ్లు ఇవే..

ఔట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న ఆరోగ్య మిత్రలను డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ క్యాడర్ కల్పించాలి. జీఓ 60 ప్రకారం వారి వేతనాన్ని రూ. 22,750లకు పెంచాలి. రాబోయే పీఆర్సీలో కనీస వేతనాన్ని రూ.35 వేలుగా నిర్ణయించి, టీఏ, డీఏ ఇవ్వాలి. వేతనాలను ఏజెన్సీ ద్వారా కాకుండా నేరుగా ట్రస్టు ద్వారా చెల్లించాలి. ఉద్యోగులందరికీ హెల్త్ కార్డులు ఇవ్వాలి. విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగావకాశం కల్పించాలి.

అందుకే సమ్మెకు దిగాం



ఆరోగ్యశ్రీతో పాటు ఈహెచ్ఎస్, జర్నలిస్టుల ఆరోగ్య సంక్షేమం, ఆయుష్మా భారత్ వంటి అన్ని వైద్య సేవల పథకాలు మేమే చేస్తున్నాం. కరోనాలో పీహెచ్‌సీలలో మా సేవలు వినియోగించుకున్నారు. కానీ మా సమస్యలు తీర్చడం లేదు. అందుకే సమ్మెకు దిగాం.

– బ్రహ్మం, ఆరోగ్యమిత్ర యూనియన్ జిల్లా అధ్యక్షుడు, మెదక్

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశాం

ఆరోగ్యమిత్రలు సమ్మెకు వెళ్తున్నందున ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశాం. అత్యవసర సేవలకు ఆటంకం కలుగకుండా ఆయా ఆస్పత్రుల్లో పనిచేసే మెడికోల సహాయం తీసుకుంటున్నాం. ఆస్పత్రుల్లో ఉన్న డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఐడీలు ఇచ్చి, కేసుల వివరాలు రిజిస్టర్ చేయించేలా టీం లీడర్ల సహాయంతో కోఆర్డినేషన్ చేయిస్తున్నాం. ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటాం.

– విజయ భాస్కర్, ఆరోగ్యశ్రీ జిల్లా మేనేజర్, సంగారెడ్డి

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు గురుకుల విద్యార్థులు

కోహెడ(హుస్నాబాద్): రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు కోహెడ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు ఆర్.బాబురావు, కే.రామచరణ్, యూ.ఉదయ్‌కుమార్, ఎస్.సంజయ్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వెంకట్రాంరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఇటీవల హన్మకొండలో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ హ్యాండ్ బాల్ క్రీడలో ఎస్.సంజయ్ పాల్గొన్నట్లు పేర్కొన్నారు. మిగితా ముగ్గురు 19, 20 తేదీల్లో హైదరాబాద్‌లోని ఉస్మానియా మైదానంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నట్లు పేర్కొన్నారు.

ఇద్దరు చింతమడక విద్యార్థులు..



విద్యార్థులు రుక్మిత, అవంతిక

సిద్దిపేటరూరల్: చింతమడక జెడ్పీహెచ్‌ఎస్‌లో చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు రాజిరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 8వ తరగతికి చెందిన దుంపటి రుక్మిత అండర్ 14 విభాగం 800 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం సాధించగా, జెల్ల అవంతిక 300 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం సాధించి ఉత్తమ ప్రతిభ కనబర్చారని పేర్కొన్నారు. 19, 20 తేదీల్లో ఉస్మానియా యూనివర్సిటీ హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. విద్యార్థులను, ఫిజికల్ డైరెక్టర్ వెంకటస్వామిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బాలరాజ్, అజీజ్, సత్తయ్య రాందాస్, రాజు, రామ్ రెడ్డి, శ్రీహరి, తదితరులు అభినందించారు.

రూ.5 వేల కోట్లు కేటాయించాలి

రెడ్డి జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాంరెడ్డి



మాట్లాడుతున్న రాంరెడ్డి

రామాయంపేట(మెదక్): రెడ్డి కార్పొరేషన్‌కు రూ. ఐదు వేల కోట్లు కేటాయించడంతోపాటు చైర్మన్‌ను నియమించాలని రెడ్డి జేఏసీ రాష్ట్ర చైర్మన్ అప్పంగారి రాంరెడ్డి, రాష్ట్ర నాయకుడు నారెడ్డి రవీందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం రామాయంపేట వచ్చిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని చెప్పి మోసగించిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ సమస్యల సాధన విషయమై సానుకూల ధోరిణితో ఉందని, అధికారంలోకి రాగానే రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసిందని వారు పేర్కొన్నారు. విదేశీ విద్యా నిధి కింద ఇతర దేశాల్లో చదువుతున్న తమ సంఘం విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేయాలని విజ్ఞప్తి చేశారు.

బాలుడి మృతదేహానికి నేడు రీ పోస్టుమార్టం

హత్నూర(సంగారెడ్డి): మండలంలోని కొన్యాల గ్రామంలో ఇటీవల మృతి చెందిన బాలుడి మృతదేహానికి గురువారం రీ పోస్ట్ మార్టం నిర్వహించనున్నట్లు ఆర్ఐ శ్రీనివాస్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. కొన్యాల గ్రామానికి చెందిన ప్రభులింగం, అనురాధ దంపతుల కుమారుడు దశ్విక్ (45 రోజులు) తీవ్ర జ్వరంతో బాధపడుతుండగా, సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. చికిత్స పొందుతూ 8 తేదీన మృతి చెందగా, ఆస్పత్రి వైద్యులు మాత్రం పరిస్థితి విషమంగా ఉందని, నీలోఫర్ ఆస్పత్రికి వెళ్లాలని చెప్పారని ఆరోపించారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగా బాలుడు మృతి చెందాడని బాధితులు సంగారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు బాలుడు డెంగ్యూతో మృతి చెందాడా.. మరేదైనా కారణంతో మృతి చెందాడా తెలుసుకునేందుకు మృతదేహానికి నేడు పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఏటీఓలో చెక్కులు మాయం

- వేతనాలు అందక పంచాయతీ కార్మికుల తిప్పలు
- మామూళ్లు ఇస్తేనే బిల్లులకు టోకెన్స్
- అలవెన్స్‌ల కోసం విశ్రాంత ఉద్యోగులు సైతం ప్రదక్షిణలు
- కుర్చీకో రేటు చొప్పున డబ్బులు వసూలు
- ఏటీఓ కార్యాలయ సిబ్బంది పనితీరుపై విమర్శలు



హుస్నాబాద్‌లోని ఏటీఓ కార్యాలయం

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్‌కు చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు నాలుగు నెలల కిందట ఉద్యోగ విరమణ పొందాడు. ప్రభుత్వం నుంచి రావాల్సిన పింఛన్, ఇతర అలవెన్స్‌ల మంజూరు కోసం నాలుగు నెలల నుంచి ఏటీఓ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీని కోసం టోకెన్ ఇవ్వాలంటే ఎస్టీఓకు ఒక రేటు, సీనియర్ అసిస్టెంట్‌కు ఒక రేటు, ఏటీఓకు మరో రేటు నిర్ణయిస్తున్నారని, మామూలు ఇచ్చిన తర్వాతనే టోకెన్లు నంబర్లు ఇస్తున్నారని బుధవారం 'సాక్షి'తో ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత చదువులు చదివి విశాంత్రి సమయంలో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఇది ఒక ఉపాధ్యాయుడి సమస్యనే కాదు బిల్లుల కోసం వచ్చే ప్రభుత్వ ఉద్యోగుల అందరి పరిస్థితి ఇదే..

హుస్నాబాద్ డివిజన్ ఏర్పడినప్పుడే 2016లో సబ్ ట్రెజరీ కార్యాలయం అసిస్టెంట్ ట్రెజరీ కార్యాలయం (ఏటీఓ)గా అప్‌గ్రేడ్ అయ్యింది. దీని పరిధిలో డివిజన్‌లోని అక్కన్నపేట, కోహెడ, హుస్నాబాద్ మండలాలు వస్తాయి. ప్రభుత్వ చెల్లింపులు మొత్తం ఏటీఓ కార్యాలయ పరిధిలోనే జరుగుతాయి. గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలు ఇవ్వాలని రెండు నెలల కిందట ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఆగస్టు మొదటి వారంలో పంచాయతీ కార్యదర్శులు బిల్లులు చేయించి చెక్కులను ఏటీఓ కార్యాలయంలో అందజేశారు.

మూడు చెక్కులు మాయం..

కోహెడ మండలం రాంచంద్రాపూర్ గ్రామ పంచాయతీ సిబ్బంది వేతనాల కోసం రూ. 60,750, ప్రభుత్వ పాఠశాల నిర్వహణ ఖర్చులు రూ.28,000, ట్రాక్టర్ బ్యాటరీ కొనుగోలు రూ.5వేలు మూడు చెక్కులను కోహెడ మండల పరిషత్ సిబ్బందితో ఎంపీఓ శోభ ఏటీఓ కార్యాలయానికి పంపించారు. ఆగస్టు 12న చెక్కులు ఇస్తే వేతనాలు ఎందుకు రావడం లేదని బుధవారం కోహెడ ఎంపీఓ శోభ ఆమె అసిస్టెంట్‌ను ఏటీఓ కార్యాలయానికి పంపించారు. అతను వెళ్లి చెక్కుల గురించి ఆరా తీయగా అవి కార్యాలయంలో కనిపించడం లేదని ఏటీఓ రాజయ్య సమాధానం ఇవ్వడంతో ఆశ్చర్యపోయాడు. ఏమిటి సార్ ఆఫీసులో చెక్కులు ఇస్తే ఎక్కడ పోతాయని ప్రశ్నించాడు. మా ఆఫీసులో సీనియర్ అసిస్టెంట్, ఎస్టీఓ మేడమ్ ఎవరు పని చేయడం లేదు చెక్కులు ఎక్కడ వేశారో తెలియదని చెప్పారు. మళ్లీ కొత్త చెక్కులు తెస్తే టోకెన్ నంబరు ఇస్తానని చావు కబురు చల్లాగ చెప్పడంతో సదరు ఉద్యోగి వెనుతిరిగిపోయాడు.

ప్రభుత్వ బిల్లులకు కొర్రీలు..

హుస్నాబాద్ డివిజన్ పరిధిలో మూడు మండలాల్లో సర్పంచ్‌లు, కాంట్రాక్టర్లు అభివృద్ధి పనుల బిల్లుల కోసం వెళ్లినప్పుడు సిబ్బందికి కొంత కమీషన్ ఇచ్చి బిల్లులు చేయించుకునేది. ప్రభుత్వ హాస్టల్ వార్డెన్లు కూడా మామూలు ఇచ్చి బిల్లులను చేయించుకునేవారు. ఇప్పుడు సర్పంచ్‌లు లేరు, కాంట్రాక్టర్లకు చేసిన పనులకు బిల్లులు రావడం లేదు. మామూళ్లు రుచి చూసిన ఉద్యోగులు ప్రభుత్వ ఉద్యోగుల వేతనాల బిల్లుల దగ్గర వసూళ్లు చేస్తున్నారని సదరు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.

రూ.1.20 లక్షలు వసూలు..

డివిజన్ పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు ఏటీఓ కార్యాలయంలో కార్మికుల వేతనాల చెక్కులు ఇచ్చారని మాకు వేతనాలు వస్తాయని ఆశగా ఎదురుచూస్తున్న కార్మికులకు ఏటీఓ నిర్లక్ష్యంతో నిరాశనే ఎదురైంది. దీంతోపాటు ఇటీవల ప్రభుత్వం వీఆర్‌ఏలను వివిధ శాఖలకు అనుసంధాం చేయడంతో వీరికి వేతనాల బిల్లులు మంజూరు కావాలంటే పుట్టిన తేదీ తప్పుందని సాకు చూపించి ఒక్కొక్కరి దగ్గర రూ.3 వేల చొప్పున 40 మంది దగ్గర రూ.1.20 లక్షలు ఏటీఓ వసూలు చేసినట్లు బదిలీ అయిన ఓ ఉద్యోగి చెప్పడం విశేషం.

సిబ్బంది పని చేయడం లేదు



మా కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్, ఎస్టీఓల మధ్య సమన్వయం లేదు. ఒక గ్రామ పంచాయతీకి చెక్కులు మాయమైన విషయం గురించి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చాను. సీనియర్ అసిస్టెంట్‌కు మెమో జారీ చేసిన, ఆఫీసు పని మొత్తం నేను ఒక్కడినే ప్రైవేటు ఉద్యోగి సహాయంతోనే చేసుకోవాల్సి వస్తుంది. గ్రామ పంచాయతీ చెక్కులు మళ్లీ తీసుకొస్తే టోకెన్ నంబర్లు వేసి బిల్లులు మంజూరు చేయిస్తాను.

– రాజయ్య, ఏటీఓ, హుస్నాబాద్

బస్ టైర్ పేలి ముగ్గురికి తీవ్ర గాయాలు



బస్సు లోపల టైర్ పై భాగంలో తేలిన రేకు



క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఎక్కిస్తున్న సిబ్బంది

- హుస్నాబాద్ నుంచి కరీంనగర్ వెళ్తుండగా ప్రమాదం
- పరిశీలించిన డిపో మేనేజర్

హుస్నాబాద్: ఆర్టీసీ బస్సు వెనుక టైర్ పేలి ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. హుస్నాబాద్ ఆర్టీసీ డిపోకు చెందిన పల్లె వెలుగు బస్సు బుధవారం మధ్యాహ్నం హుస్నాబాద్ నుంచి కరీంనగర్‌కు వెళ్తుంది. పట్టణంలోని నాగారం రోడ్‌లోని శ్రీనివాస్ ఆస్పత్రి సమీపంలో ఒక్కసారి బస్సు వెనుక టైర్ పేలి పెద్ద శబ్ధం రావడంతో ప్రయాణికులు, చుట్టు పక్కల వారు భయాందోళనకు గురయ్యారు. రెండు టైర్లలో ఒకటి పేలగా టైర్ పైన ఉన్న రేకు ఒక్కసారిగా ఎగిరిపడి సీట్లో కూర్చున్న ముగ్గురు మహిళా ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుల్లో అక్కన్నపేట మండలం కుందనవానిపల్లికి చెందిన మాలోతు శిశు ప్రియ, పెద్దపల్లి జిల్లా పెగడపల్లి గ్రామానికి చెందిన బుర్ర ప్రవళిక, గోదావరి ఖని, సుందిళ్ల గ్రామానికి చెందిన బుర్ర కల్యాణి ఉన్నారు. క్షతగాత్రులను 108 వాహనంలో కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగినప్పుడు బస్సులో 80 మంది ప్రయాణికులు ఉన్నారు.

డిపో మేనేజర్ పరిశీలన

ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైన స్థలాన్ని డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు, అధికారులు పరిశీలించారు. డ్రైవర్, కండక్టర్‌లను ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. బస్సు లోపల టైర్ పై భాగంలో తేలిన రేకును పరిశీలించారు. గుండు టైర్ల విషయంపై టైర్ మెకానిక్‌ను పిలిపించి పూర్తి వివరాలు తెలుసుకుంటామని వెల్లడించారు. ఈ ఘటనపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరా తీశారు. ఆర్టీసీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ప్రమాదం జరిగిన తీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు.

అరిగిపోయిన టైర్లు

ప్రమాదానికి గురైన బస్సు టైర్లు పూర్తిగా గుండుగా మారాయి. బస్సుల కండిషన్‌ను ఎప్పటికప్పుడూ పర్యవేక్షించి బస్సులను బయటకు పంపాల్సిన ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శలు వెలువెత్తుతున్నాయి. గుండు టైర్లు, కండిషన్ లేని బస్సులు ఎక్కడ ఆగుతాయో తెలియని పరిస్థితి నెలకొంది.

మద్యానికి డబ్బులివ్వలేదని ఆత్మహత్య

పురుగుల మందు తాగిన యువకుడు



మధు (ఫైల్)

సిద్దిపేటకమాన్: పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ ఉపేందర్ కథనం మేరకు.. పట్టణంలోని రాంనగర్‌కు చెందిన జెల్ల పద్మ పట్టణంలోని రైతు బజార్‌లో కూరగాయలు విక్రయిస్తూ చిన్న కుమారుడు మధు(29)తో కలిసి గుండ్ల చెరువు ప్రాంతంలో నివాసం ఉంటుంది. కుమారుడు డెకరేషన్ పనులు చేస్తూ మద్యానికి బానిసయ్యాడు. డబ్బులు కోసం తరచుగా తల్లితో గొడవపడుతుండేవాడు. మంగళవారం కూడా గొడవపడగా డబ్బులు ఇవ్వకపోవడంతో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

భార్య కాపురానికి రావడం లేదని..



రాజు (ఫైల్)

తొగుట(దుబ్బాక): భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపానికి గురైన యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని కాన్గల్ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. తొగుట ఎస్ఐ రవికాంతరావు కథనం మేరకు.. గ్రామానికి చెందిన కాముని రాజు(30)కి కొమురవెల్లి మండలంలోని పోసానిపల్లి గ్రామానికి చెందిన భవానీతో ఏడేళ్ల కిందట వివాహమైంది. భార్యాభర్తల మధ్య గొడవలు జరగడంతో భవానీ పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో రాజు మద్యానికి బానిసయ్యాడు. భార్య కాపురానికి రాదేమోనని జీవితంపై విరక్తి చెంది మంగళవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి ముత్తయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవికాంతరావు తెలిపారు.

భర్త వేధింపులు భరించలేక..



అనూష (ఫైల్)

మర్కుక్(గజ్వేల్) : భర్త వేధింపులు భరించలేక మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ దామోదర్ కథనం మేరకు.. జగదేవ్‌పూర్ మండలం తిగుల్ గ్రామానికి చెందిన అనూష(22)తో మర్కుక్‌కు చెందిన నవీన్‌కు ఏడాది కిందట వివాహమైంది. కొన్ని నెలలుగా భార్య వేరే అబ్బాయితో ఫోన్ మాట్లాడుతుందంటూ మద్యం తాగి వేధిస్తున్నాడు. వేధింపులు భరించలేక మంగళవారం సాయంత్రం అత్తగారింట్లో అనూష పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబీకులు చికిత్స కోసం ములుగు మండలంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతి చెందింది. మృతురాలి తల్లితండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పెన్షన్ ఇప్పిస్తానని రూ.10 వేలు టోకరా

- బ్యాంకు వద్ద వృద్ధుడిని మోసగించిన ఆగంతకుడు



సీసీపుటేజీలో లక్ష్మీపతితో ఆగంతకుడు

బెజ్జంకి(సిద్దిపేట): పెన్షన్ డబ్బుల కోసం వచ్చిన ఓ వృద్ధుడిని ఆగంతకుడు మోసం చేసిన ఘటన మండల కేంద్రంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు లక్ష్మీపతి బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గుండారం గ్రామానికి చెందిన లక్ష్మీపతి బెజ్జంకిలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌కు మంగళవారం వచ్చి పెన్షన్ డబ్బులు డ్రా చేసుకున్నాడు. అక్కడ పరిచయమైన ఓ ఆగంతకుడు తాను గ్రామ పంచాయతీ కార్యదర్శినని చెప్పి రూ.10 వేలు ఇస్తే రూ.4 వేలు పెన్షన్ వచ్చేలా చేస్తానని నమ్మబలికాడు. ఇది నమ్మిన వృద్ధుడు రూ.10 వేలు ఇచ్చాడు. ఇప్పుడే వస్తానని అక్కడి నుంచి మాయమయ్యాడు. తాను మోసపోయిట్లు గుర్తించిన బాధితుడు బ్యాంకు మేనేజర్‌కు తెలిపాడు. ఎస్ఐ క్రిష్టారెడ్డికి విషయం చెప్పగా సీసీ కెమెరాలు పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

నగల దుకాణంలో చోరీ

- 8 బంగారు గొలుసులు అపహరణ



చోరీ జరిగిన జ్యువెలరీ షాపు

సిద్దిపేటకమాన్: పట్టపగలే ఓ గుర్తు తెలియని వ్యక్తి బంగారం షాపులో చోరీకి పాల్పడ్డాడు. ఈ ఘటన బుధవారం సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ ఉపేందర్ కథనం మేరకు.. పట్టణంలోని లాల్‌కమాన్ సమీపంలోని నయిమ్ మియా గ్రాండ్ సన్స్ జ్యువెలరీ షాపునకు గుర్తు తెలియని వ్యక్తి వచ్చి తనకు బంగారు గొలుసు కావాలని అడిగాడు. సిబ్బంది గొలుసులను చూపిస్తుండగా 10 గ్రాముల బరువున్న 8 బంగారు గొలుసుల బాక్స్‌ను షాపు వారి కన్నుకప్పి దొంగిలించాడు. అనంతరం షాపు నిర్వాహకుడు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ ఉపేందర్ ఘటనా స్థలానికి చేరుకొని సీసీ కెమెరాలను పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

తాళం వేసిన ఇంట్లో..

వట్‌పల్లి(అందోల్): తాళం వేసిన ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడిన ఘటన అందోలు మండల పరిధిలో చోటు చేసుకుంది. జోగిపేట ఎస్ఐ పాండు కథనం మేరకు.. డాకూరు గ్రామానికి చెందిన ఎర్రారం స్వరూప, భర్త పోచయ్య కలిసి 17న మంగళవారం సాయంత్రం ఇంటికి తాళం వేసి తాలెల్మ గ్రామంలోని బంధువుల ఇంట్లో ఫంక్షన్‌కు వెళ్లారు. బుధవారం ఉదయం ఇంటికొచ్చి చూడగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. బీరువాలోని తులం బంగారం, రూ.10 వేల నగదు కనిపించకపోవడంతో దొంగలు పడినట్లు గుర్తించారు. బాధితురాలు స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ పోటీల్లో కవేలి విద్యార్థి



ప్రయోగాన్ని ప్రదర్శిస్తున్న ముస్తఫా అహ్మద్

జహీరాబాద్: ఢిల్లీలో బుధవారం నిర్వహించిన ఇన్‌స్పైర్ మానక్ ప్రాజెక్టు అవార్డుల పోటీల్లో కోహీర్ మండలంలోని కవేలి గ్రామానికి చెందిన విద్యార్థి ఎం.డీ ముస్తఫా అహ్మద్ పాల్గొన్నారు. కవేలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ముస్తఫా తన ప్రయోగాన్ని ప్రదర్శించి వివరించారు. గురువారం సైతం తన ప్రదర్శన నిర్వహించనున్నారు. పోల్‌పైకి ఎక్కకుండానే లైటు బిగించే విధానంపై ముస్తఫా ప్రయోగాన్ని ప్రదర్శనకు ఉంచారు. ఫిబ్రవరి 14, 15వ తేదీలో రాష్ట్ర స్థాయిలో ప్రదర్శనల్లో ముస్తఫా ప్రయోగం జాతీయ స్థాయికి న్యాయ నిర్ణేతలు ఎంపిక చేశారు.

కల్లు డిపోలో పనికెళ్లి.. కుంటలో శవమై తేలి

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

జోగిపేట(అందోల్): అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన ఘటన జోగిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని అందోల్‌లో చోటు చేసుకుంది. ఎస్ఐ పాండు కథనం మేరకు.. అన్నాసాగర్ గ్రామానికి చెందిన చవిటి పవన్ కల్యాణ్(25) మంగళవారం ఇంటి నుంచి అందోలు కల్లు డిపోకు పనికి వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో చుట్టు పక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో అందోల్ గూడెంలో గల మారేటి కుంటలో శవమై తేలి స్థానికులు కనిపించాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. భార్య వసంత ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇంటి ఎదుట బట్టలు ఆరేస్తుండగా..

- విద్యుదాఘాతంతో మహిళ మృతి



లావణ్య (ఫైల్)

సిద్దిపేటకమాన్: విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందారు. ఈ ఘటన సిద్దిపేట పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని ఎన్‌జీవోస్ కాలనీలో నివాసముండే చొప్పదండి శ్రీనివాస్, లావణ్య(41) దంపతులకు కూతురు, కుమారుడు ఉన్నారు. శ్రీనివాస్ పట్టణంలో ఆప్టికల్ షాపు నిర్వహిస్తుండగా లావణ్య షాపులో అతడికి సహాయం చేస్తూ ఉండేది. బుధవారం మధ్యాహ్నం ఉతికిన బట్టలు ఇంటి ఎదుట ఆరేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురైంది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నడుచుకుంటూ వెళ్తుండగా కరెంట్ షాక్

సంగారెడ్డి టౌన్ : విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన సంగారెడ్డి పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ భాస్కర్ కథనం మేరకు.. సంగారెడ్డిలోని గొల్లగూడెం కాలానికి చెందిన గొల్లగుడి మల్లేశం (56) కలెక్టరేట్‌లోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో అటెండర్ విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం ఉదయం పని నిమిత్తం ఇంటి నుంచి బయటకు వెళ్లి వస్తుండగా ఐటీఐ వద్ద రాగానే ప్రమాదవశాత్తు వైర్లకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి పోలీసులు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..



ఘటనా స్థలంలో కార్తీక్ మృతదేహం

కొమురవెల్లి(సిద్దిపేట): బైక్ అదుపుతప్పి పడిపోవడంతో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని పోసాన్‌పల్లి శివారులో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. చేర్యాల పట్టణంలోని గడితోటకు చెందిన రాజు, జగదేవ్‌పూర్ మండలం మునిగడపకు చెందిన నవీన్, వట్టిపల్లికి చెందిన బొనుకలూరు కార్తీక్(18) కొండపోచమ్మ నుంచి కొమురవెల్లికి బైక్‌పై వెళ్తున్నారు. పోసాన్‌పల్లి శివారులోకి రాగానే బైక్ అదుపుతప్పి పడిపోయారు. ఈ ప్రమాదంలో వెనుక కూర్చున్న కార్తీక్‌కు తీవ్రగాయలై అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ నడుపుతున్న రాజుకు తీవ్రగాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. మరో యువకుడు నవీన్ పరారయ్యాడు.

ఆర్టీసీలో 'క్యూఆర్' కోడ్

- కూర్చున్న చోటు నుంచే సేవలు
- కోడ్ ఒకటి.. యాప్‌లు పది
- బస్సులకు సంబంధించి పూర్తి సమాచారం అందుబాటులోకి..
- తప్పనున్న చిల్లర కష్టాలు
- వినియోగించుకోవాలంటున్న ఆర్టీసీ అధికారులు



సంగారెడ్డి ఆర్టీసీ డిపో (ఇన్‌సెట్‌లో..) క్యూఆర్ కోడ్

సంగారెడ్డి టౌన్: ఆర్టీసీ రోజురోజుకూ ఆధునికతను అందిపుచ్చుకుంటోంది. ఇప్పటికే సాంకేతికత ఆధారంగా సీట్ల రిజర్వేషన్, వివిధ సందర్భాల్లో డిజిటల్ లావాదేవీలను విజయవంతంగా నిర్వహిస్తోంది. ప్రైవేటు బస్సుల నుంచి ఏర్పడుతున్న పోటీని తట్టుకునేందుకు కొత్త యాప్‌లను ప్రవేశపెట్టింది. ఈ క్రమంలో ప్రజలకు మరింత చేరువయ్యేందుకు ప్రత్యేకంగా 'క్యూఆర్ కోడ్' అందుబాటులోకి తీసుకొచ్చింది. పది రకాల సేవలు ఒకే చోట లభించే విధంగా కోడ్ రూపొందించారు.

ఉమ్మడి మెదక్ జిల్లాలో 556 బస్సులు ఉండగా ప్రతిరోజు 2.75 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారు. ఈ ప్రయాణికుల సమయం వృథా కాకుండా ఉండేందుకు ప్రభుత్వం సాంకేతికను ఉపయోగించి త్వరగా సేవలు అందేలా చేస్తుంది. డబ్బులు చెల్లింపు, ఇతర సేవలకు క్యూఆర్ కోడ్‌ను తీసుకొచ్చింది. దీని ద్వారా ప్రయాణికులకు మొబైల్ ద్వారానే మెరుగైన సేవలు అందనున్నాయి. దీంతో డబ్బులు ఇచ్చి టికెట్ తీసుకోవడం ఉండదు. అలాగే, కండక్టర్‌లకు చిల్లర కష్టాలు కూడా తప్పనున్నాయి.

వివరాలు పొందుపర్చాలి

ఆర్టీసీ తీసుకొచ్చిన క్యూఆర్ కోడ్ పది యాప్స్‌కు అనుసంధానం ఉంటుంది. క్యూఆర్ కోడ్ సాయంతో ఉన్న చోట నుంచే ఆర్టీసీ సేవలన్నీ పొందడానికి వీలవుతుంది. ఆన్‌లైన్ బస్ టికెట్ బుకింగ్ వెబ్ సైట్, గమ్యం, ఆన్‌లైన్ బుకింగ్ యాప్, ఇన్‌స్టాగామ్, ఎక్స్, యూట్యూబ్, ఫేస్ బుక్, వాట్సాప్ ఛానల్ ఉంటాయి. గమ్యం, ఆన్‌లైన్ బుకింగ్‌కు సంబంధించి మొత్తంగా 10 రకాల యాప్ సర్వీ సులు ఒకే చోట ఉంటాయి. మెయిల్ ఐడీ, పాస్‌వర్డ్ సాయంతో ఒక్కసారి మన వివరాలను పొందుపరిస్తే ఎప్పుడైనా వినియోగించుకోవడం సులభమవుతుంది.

మొబైల్‌లోనే సేవలన్నీ..

ప్రయాణికులు మొబైల్ నుంచి ఆర్టీసీ క్యూ ఆర్‌కోడ్ స్కాన్ చేస్తే సేవలు అందుబాటులోకి వస్తాయి. మనం ప్రయాణించాల్సిన బస్సు ఎక్కడుంది.. గమ్యానికి ఎప్పుడు చేరుకుంటుంది అనే అంశాలు ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. రాష్ట్రంలో నడుస్తున్న బస్సుల వివరాలను తెలుసుకోవచ్చు. పెళ్లిళ్లు, శుభకార్యాలకు , విహార యాత్రలకు రాయితీలపై బుకింగ్ చేసుకునే సదుపాయం ఉంటుంది. ఒక్కసారి స్కాన్ చేస్తే ఆర్టీసీ కి సంబంధించిన పది రకాల యాప్‌లను వినియోగించుకోవచ్చు.

ఎంతో ఉపయోగపడుతుంది



ప్రయాణికులు బస్సు బుకింగ్ చేసుకున్నప్పటి నుంచి అక్కడిచి వచ్చే వరకు ఫోన్ చేస్తూ ఉండేవారు. ఇప్పుడు ఈ యాప్ ద్వారా వారికి చేరే సమయం చూపెడుతుంది. దీంతో ఇబ్బంది తగ్గుతుంది. సమయాన్ని సద్వినియోగం చేసుకోవడంతోపాటు బస్సు ఎక్కడ ఆగుతుంది అనే బస్టాండ్‌ను కూడా చూపెడుతుంది.

– విజయ్ కుమార్ గౌడ్, కండక్టర్

అవగాహన కల్పిస్తున్నాం



కొత్త క్యూఆర్ పై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. ఒక్క స్కాన్‌తో పది రకాల యాప్‌లు అందుబాటులోకి వస్తాయి. ప్రైవేట్ బస్సులకు దీటుగా గమ్యస్థానాలను యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. మహిళలు కూడా బస్టాండ్లలో ఎక్కువ సమయం వేచి ఉండకుండా సమయానికి వచ్చి బస్సు ఎక్కి వెళ్లిపోవచ్చు.

– ప్రభులత, ఆర్టీసీ రీజినల్ మేనేజర్

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

- ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ పురుషులు కావలెను. Qul:10th-డిగ్రీ, Sal:20k-30k మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 9030612463 [G-9039]
- త్రివేణి హోం కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను /పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి+భోజనం. జీ:18K. Ph: 9160900024,9640400073. [H-796277]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.